

బైకుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి

ఊర్కొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బైక ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచాలపల్లి పరిధిలోని కాల్యా తండాకు చెందిన పీర్యానాయక్ (30) ఊర్కొండ నుంచి తండాకు వెళ్తున్న క్రమంలో రైస్‌మిల్లు వద్ద బైక అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న యువకులు గుర్తించి వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వీరబాబు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై విచారణ చేపట్టుతున్నట్లు పోలీసు సిబ్బంది పేర్కొన్నారు.

వైద్యం కోసం వస్తే..

- అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్ వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ప్రైవేట్‌కు పంపుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు
- మామూళ్ల మత్తులో వైద్యాధికారులు



కవిత మృతదేహంతో ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు(ఫైల్)

జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రైవేట్ వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మత్తు డాక్టర్ చేయాల్సిన పని కూడా ముక్కు వైద్యం చేసే డాక్టర్లే కానిచ్చేస్తున్నారు. ఇటీవల ఒక మహిళ ముక్కు సమస్యతో వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నది. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆస్పత్రులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

6

- గద్వాల క్రైం, ఆంధ్రజ్యోతి

ఉత్తిపోతలు

ప్రాజెక్టులు - పరిహాసం 5

నీటిని ఎత్తిపోయడానికి మోటార్లు కరువు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు సవాలక్ష సమస్యలతో కూనరిల్లుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం, చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడం దశాబ్దాలుగా సాగుతున్న తంతు. పూర్తయిన ఎత్తిపోతల పథకాల నుంచి అయినా సరిపడా, సమయానికి నీటిని ఎత్తిపోసుకునే పరిస్థితి ఉన్నదా అంటే అదీ లేదు. ఎత్తిపోయడానికి నిర్దేశించిన మోటార్లు ఉండవు, స్టాండ్‌బై మోటార్లు పనిచేయవు, పనిచేస్తున్న మోటార్ల నుంచి వచ్చిన నీరు పారే కాల్వలు కూడా పరిపడకుండా ఉన్నాయి. దీంతో వరదలు వచ్చినప్పుడు కాల్వలు తెగడం, పంపుహౌస్‌లు మునగడం లాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మొత్తంగా పరిస్థితిని చూస్తే సాగునీటి ప్రాజెక్టులు నగుబాటుకు గురవుతున్నాయి.

- అన్ని ఎత్తిపోతల పథకాల కింద మోటార్లలో తరచూ సమస్యలే...
- సామర్థ్యం ఉన్నా అనుకూలంగా లేని డెలివరీ సిస్టర్న్‌లు, కెనాళ్లు
- స్టాండ్‌బైలో ఉన్న మోటార్లు చాలా ఎత్తిపోతల్లో పనిచేయని పరిస్థితి
- నిర్వహణా ఏజెన్సీలకు సమయానికి బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- మధ్యలోనే వదిలేస్తుండటంతో మరమ్మతులు చేయడంలో జాప్యం



కోయిల్ సాగర్‌కు నీటిని ఎత్తిపోసేందుకు జూరాల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు



కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా జొన్నలబొగుడ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు

మహబూబ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎత్తిపోతల పథకాలకు ప్రధాన అవసరమైన మోటార్లతో ప్రతీఏట సమస్యగా మారింది. పేరుకు కావాల్సినంత సంఖ్యలో మోటార్లు పంప్‌హౌజుల్లో బిగించినప్పటికీ అందులో ఎప్పుడూ సగానికి ఎక్కువగా మోటార్లు సాంకేతిక సమస్యలతో మరమ్మతుల్లో ఉంటున్నాయి. ఇప్పటికే రిజర్వాయర్లలో నీటినిల్వ సామర్థ్యం ఎక్కువగా లేకపోవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు చిన్న చిన్న చెరువులు, వాగుల్లోకి నింపుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే సరిగ్గా వరద వచ్చే సమయాల్లోనే మోటార్లు మొరాయించడం వంటి సమస్యలు ఉత్పన్నమవడంతో అనుకున్నంత నీటిని ఎత్తిపోసుకోలేని పరిస్థితి. పేరుకు

(మిగతా 6లో..)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ఇద్దరి మృతి



నగేష్ (ఫైల్)

- ట్రాక్టర్, బొలెరో ఢీకొని ఒకరు..
- ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో మరొకరు..

7

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రస్నానం

- ముగిసిన మల్దకల్ బ్రహ్మోత్సవాలు



దేవాలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

7

రెండో రోజు

కొనసాగిన ఆందోళన



కందుల ధర పెంచి కొనాలని నారాయణపేటలో రైతుల రాస్తారోకో

6

పొగచూరుతున్న బతుకులు

- దుర్భర పరిస్థితుల్లో బీడీ కార్మికులు
- అమలు కాని సంక్షేమ పథకాలు
- అందుబాటులో లేని వైద్య సేవలు
- పట్టించుకోని పరిశ్రమల యాజమాన్యాలు



అమరచింతలో బీడీ పని చేస్తున్న వృద్ధులు

7

చలి చంపేస్తోంది

మూడ్రోజులుగా ఉమ్మడి జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో కనిష్ఠం 9.7 డిగ్రీలు



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రం సమీపంలో స్వెటర్ ధరించి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరును చలి చంపేస్తోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి గాలులు చిగురుటాకులా వణికిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలో 9.7 డిగ్రీల కనిష్ఠానికి ఉష్ణోగ్రత పడిపోవడంతో ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించారు. రాత్రివేళ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం ఏడు గంటలు దాటినా తలుపులు తీసే పరిస్థితి లేదు. వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారి పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. తెల్లవారుజామున పనులకు వెళ్లే మునిసిపల్ కార్మికులు, పాల, కూరగాయల, వీధి వ్యాపారులు, రైతులు, పేపర్‌బాయ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వెటర్లు ధరించకుండా బయట తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. మంచుకు దారి కనిపించక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాలలో ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు చలిమంటలు వేసుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో చలికి చెంచులు అల్లాడుతున్నారు. జిల్లలో రాత్రి వేళ 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవడం గమనార్హం. చలికి శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు. పది గంటలు తర్వాతే దుకాణాలు తెరుచుకుంటున్నాయి.



జిల్లాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
నాగర్‌కర్నూల్	29	9.7
జోగుళాంబ గద్వాల	30.8	10.9
మహబూబ్‌నగర్	31.5	15.5
నారాయణపేట	29	16

ఖిల్లా ఘణపురం మండలం రోడ్డు మీదతండాలో కమ్ముకున్న పొగమంచు



నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరులో ఉదయం తొమ్మిది గంటలకు కూడా వీడని మంచు



ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో చలికి ఆటోలో దుప్పటి కప్పుకుని వెళ్తున్న ప్రయాణికులు

క్షయ నిర్ధారణకు మొబైల్ ఎక్స్‌రే

- ప్రారంభించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



వైద్యాధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్ధారణ కోసం రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఆధునిక మొబైల్ ఎక్స్‌రే యంత్రాన్ని మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రారంభించారు. అనంతరం తాను ఎక్స్‌రే తీయించుకున్నారు. జిల్లాలోని దగ్గు జ్వరంతో బాధపడుతున్న వారందరికి క్షేత్రస్థాయిలోనే పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారించేందుకు మొబైల్ ఎక్స్‌రే యంత్రం కొనుగోలు చేశామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎంఎస్‌జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నేడు వనపర్తి పట్టణంలో నిర్వహించే బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఎంఎస్‌జే వైద్య సిబ్బంది బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌కు అవసరమైన పరికరాలతో జిల్లాకు విచ్చేయనున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ మహిళా పారిశుధ్య కార్మికులతో పాటు కడుకుంట్ల, గోపాల్‌పేట, పెద్దమందడి నుంచి బ్రెస్ట్ క్యాన్సర్ అనుమానిత మహిళలకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామచంద్రారావు, డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

తీగ లాగితే

డొంక కదిలింది

- వెలుగులోకి వచ్చిన ఫిర్యాదులు
- విచారణలో నిజమని తేలితే రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేస్తాం
- ఏజెన్సీ డెవలప్‌మెంట్ అధికారి మాధవి

పదర, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడి నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్లకు సంబంధించి కేస్ స్టడీలో తీగలాగితే డొంక కదిలింది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫేక్ సర్టిఫికెట్లు' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఏజెన్సీ డెవలప్‌మెంట్ అధికారి (ఆర్‌డీవో) మాధవి మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు వివరాలు వెల్లడించారు. నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్ల విచారణలో నిజమని తేలితే బాధ్యులను రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేస్తాం అని అన్నారు. అంతే కాకుండా రెవెన్యూ శాఖలో కూడా వీఏవో నుంచి తహసీల్దార్ వరకు పదోన్నతి పొందిన వారిపై కూడా ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. వాటిపై కూడా విచారణ చేపట్టి సమాచారాన్ని కలెక్టర్‌కు నివేదించామని ఆమె తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏజేన్సీ డెవలప్ మెంట్ అధికారి మాధవి

సర్వేయర్లతో సమస్య..

- జిల్లాలో పరిష్కారానికి నోచుకోని భూముల సర్వే
- ఈ ఏడాదిలో 1,947 దరఖాస్తులు వస్తే పరిష్కరించింది 687 మాత్రమే
- హద్దుల ఏర్పాటు కోసం రైతుల ఎదురుచూపులు



వనపర్తి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో సర్వేయర్లతో రైతులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పొలాన్ని కొలవాలంటే సర్వేయర్ రావాల్సిందే.. సర్వే నంబరు బౌండరీ గుర్తించాలన్నా.. విస్తీర్ణం కొలవాలన్నా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి సర్వేయర్ రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడు తున్నారు. ఈ ఏడాది 1947 దరఖాస్తులు వస్తే సర్వే చేసింది 687 మాత్రమే.. మిగతా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లా 15 మంది సర్వేయర్లు ఉన్నారు. అప్పట్లో భూములను గొలుసుతో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసిన కాలంలో కూడా దరఖాస్తు లు పెండింగ్‌లో ఉండేవి కాదని, జీపీఎస్, లైడర్ సిస్టం అందుబాటులో ఉన్నా దరఖా స్తులు ఎందుకు పెండింగ్ పెడుతున్నారోనని రైతులు వాపోతున్నారు. ఒక వేళ సర్వేయర్ వచ్చి హద్దులు ఏర్పాటు చేసినా సరిగ్గా రావడం లేదని, అనుమానం వచ్చిన వారు తిరిగి జిల్లా సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సర్వేయర్ కోసం మళ్లీ ఏడాది తిరిగినా దర్శనభాగ్యం కలగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే కోసం వచ్చిన దరఖాస్తు ప్రకారం సర్వే చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ప్రారంభమైన

సీఎం కప్-2024

- క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్
- జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలి
- జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడం కోసం సీఎంకప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీహెచ్ ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జెండాను ఎగురవేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ విద్యార్థుల, క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడా పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వరకు కొనసాగుతాయని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సీఎంకప్ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ గ్రామీణ మండల స్థాయిలో విజయం సాధించి జిల్లాస్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జిల్లా ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మునిసిపల్ చైర్‌పర్సన్ కల్పన భాస్కర్, డీవైఎస్‌వో సీతారాంనాయక్, డీఎస్పీ శ్రీనివాసులు, వివిధ క్రీడా అసోసియేషన్ నాయకులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

"లా" అడ్మిషన్లు
మేనేజ్‌మెంట్ కోటా క్రింద 3 మరియు 5 సంవత్సరముల "లా" కోర్సు నందు అతి కొద్ది సీట్లు మాత్రమే కలవు. వెంటనే సంప్రదించండి : ప్రిన్సిపాల్, శ్రీ ప్రసూన కాలేజ్ ఆఫ్ "లా", కొత్తపేట, కర్నూలు.
AJL-202632

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
ప్రతి 4లైన్లకు 200/- రూ.
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365



ఎంజీఎల్ఐ పథకంలో భాగంగా జొన్నల బొగుడ వద్ద ఏర్పాటు చేసిన పంపులు



వట్టెం రిజర్వాయర్ వద్ద నీట మునిగిన పంపులు(ఫైల్)

ఉత్తిపోతలు

ప్రాజెక్టులు పరిహారం - 5

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కేటాయింపులకు దగ్గరగా ఉపయోగించుకుంటున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవంలో అంత సీన్ లేదనే చెప్పాలి. ప్రధానంగా నిర్వహణ ఏజెన్సీలకు సమయానికి బిల్లులు చెల్లించకపోవడంతో ఆ ఏజెన్సీలు కూడా సమయానికి మరమ్మతులు చేయడం లేదు. సాధారణ గ్రావిటీ ప్రాజెక్టులతో పోల్చితే ఎత్తిపోతల పథకాలకు ఎక్కువ నిర్వహణ ఖర్చు అవుతుంది. కానీ, అవి ప్రభుత్వం నుంచి సరిగ్గా అందడం లేదు.

వరద నీటికే మునక...

కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా చేపట్టారు. అక్కడ నది వెడల్పు తక్కువగా ఉండటంతో పీడనం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో అప్రోచ్ కెనాల్ వద్ద షట్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి ఏర్పాటు చేయలేదు. అలాగే ప్రతీ పంప్‌హౌజ్ అప్రోచ్ కెనాల్ వద్ద ఈ షట్టర్ల ఏర్పాటు అవసరం. అనుకోకుండా పైన ఉన్న చెరువులు తెగి వరద ప్రవాహం ఎక్కువైన ఆ నీటి ఒత్తిడి పంప్‌హౌజ్‌పై పడదు. ఉదాహరణకు ఇటీవల పాలమూరు- రంగారెడ్డిలో అంత ర్భాగంగా నిర్మించిన వట్టెం పంప్‌హౌజ్ అప్రోచ్ కెనాల్ లేనందున భారీ వర్షాలకు ఎగువన ఉన్న చెరువులు తెగడంతో ఆ నీరంతా మోటార్లను ముంచెత్తింది. అలాగే కల్వకుర్తి పంపుల పరిస్థితి కూడా ఉన్నది. ప్రస్తుతం ఉన్న ఐదు మోటార్లలో కేవలం మూడు మోటార్లు పని చేస్తున్నాయి. ఎల్లూరు పంప్‌హౌజ్ కూడా మూడు సార్లు మునకకు గురైంది. 2009లో ఒకసారి, 2014లో మరోసారి, 2020లో మూడోసారి ఈ పంప్‌హౌజ్‌లోని మోటార్లు మునిగాయి. ఇప్పుడు ఇక్కడ స్టాండ్ బై మోటార్లు లేవు. పటేల్ కంపెనీకి నిర్వహణ కాంట్రాక్టు ఉండగా 2017తో అది ముగిసింది. 2017 నుంచి 2021 వరకు అనధికారికంగా వారితోనే నిర్వహణ చేయించారు. ప్రస్తుతం మరో కంపెనీ నిర్వహణ చేస్తోంది. అయితే ఇప్పటివరకు ఆ కంపెనీకి దాదాపు రూ. 5 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

అనువుగా లేని డెలవరీ సిస్టర్న్‌లు...

పంప్‌హౌజ్ నుంచి పైపుల ద్వారా నీరు దూకే ప్రాంతాన్ని డెలీవరి సిస్టర్న్ అంటారు. సాధారణంగా ఈ డెలవరీ సిస్టర్న్‌ను మోటార్ల పూర్తి సామర్థ్యం ఆధారంగా నిర్మించాల్సి ఉంటుంది. కేఎల్ఐ ప్రాజెక్టు మోటార్ల ద్వారా దాదాపు 4 వేల క్యూసెక్కుల నీరు దూకుతుంది. కానీ, అన్ని మోటార్లు నడిస్తే అంత మొత్తం డెలవరీ కావడానికి అనుగుణంగా సిస్టర్న్ లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇది సరిగా నిర్మించలేదని ఆరోపించింది. అలాగే మొదటి డిజైన్ ప్రకారం కాలువలు వెడల్పు 9 మీటర్లు ఉండాలి. కానీ, 6.7 మీటర్ల వెడల్పుతోనే కాలువలను నిర్మించడంతో తరచూ గండ్లు పడి పంటలను నష్టపోతున్న పరిస్థితి ఉన్నది. ఇదే కాకుండా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉన్నది. ఈ ప్రాజెక్టును ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నిర్మించగా రెండు 550 హెచ్‌పీ మోటార్లు, ఒకటి 1050 హెచ్‌పీ మోటార్ అమర్చారు. కానీ డెలవరీ సిస్టర్న్ మాత్రం ఒక్క 550 హెచ్‌పీ మోటార్ నడిస్తేనే సరిపోయే విధంగా నిర్మించారు. ఇప్పటికీ మొత్తం మూడు మోటార్లలో ఒక్క 550 హెచ్‌పీ మోటార్ మినహా మిగతా మోటార్లను వినియోగించుకోలేకపోతున్నారు. స్టోరేజీ రిజర్వాయర్లు కూడా లేకపోవడంతో ప్రస్తుతం ఆ సమస్య పెద్దగా కనిపించడం లేదు. స్టోరేజీ రిజర్వాయర్లు నిర్మిస్తే డెలివరీ సిస్టర్న్ పరిస్థితి, ఆర్డీఎస్ కాలువ అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితి అందరికీ తెలియవస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద రెండు లిఫ్ట్‌లలో ఏడు విద్యుత్ మోటార్లు ఉండటంతో ప్రతీ ఏడాది కోట్లలో విద్యుత్ బిల్లులు రావడం సాధారణమే. అయితే విద్యుత్ మోటార్లు తరచూ చెడిపోతున్నాయి. మెయింటెనెన్స్ బిల్లులు ఇవ్వకపోడంతో ఒప్పందం ఉన్న చైనా కంపెనీ ప్రతినిధులు మరమ్మతులు చేయడానికి రాలేదు. స్టాండ్ బై ఉన్న విద్యుత్ మోటార్‌తో రెండు నెలలుగా నెట్టుకొస్తున్నారు.

పక్కనే నది ఉన్నా నీరందడం లేదు



రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఏరులై పారుతున్నా.. ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా మొలచింతల పల్లి, ముక్కిడిగుండం గ్రామాలకు జిల్దార్ తిప్పా చెరువు ద్వారా నీరందించలేకపోయారు. ఇప్పటికైనా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా చెరువును నింపి, సాగు, తాగు నీరు అందించాలి. ముక్కిడిగుండం పెద్ద వాగు వద్ద మినీ లిఫ్టు ఏర్పాటు చేస్తే నల్లమల్ల గ్రామాల రైతుల ఇబ్బందులు తీరుతవి. చెంతనే కృష్ణానది ఉన్న నీటి కోసం దిక్కులు చూసే పరిస్థితి ఉంది.

\- గంగం మల్లేష్ యాదవ్, ముక్కిడిగుండం, రైతు

పిల్ల కాలువ లేక అవస్థలు



ఎంజీఎల్ఐ ప్రధాన కాలువలకు పిల్ల కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో పంటలకు నీరందడం లేదు. పొలాల మీదుగా పైపులైన్ ఏర్పాటు చేసుకొని, నీటిని తెచ్చుకుంటామంటే కొంతమంది ఒప్పుకోవడం లేదు. అధికారులు స్పందించి, పిల్ల కాలువలు పూర్తి చేసి మా భూములకు నీరందేలా చూడాలి.

\- సల్లేశ్వరం, రైతు, కోడేరు

రెండో రోజు కొనసాగిన ఆందోళన

- కందుల ధర పెంచి కొనాలని నారాయణపేటలో రైతుల రాస్తారోకో
- ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన కార్యక్రమం
- భారీగా ట్రాఫిక్ జామ్
- క్వింటాలుపై రూ.250 పెంచి కొంటామని ఆర్డీవో హామీ
- ఆందోళన విరమించిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాంచందర్



మార్కెట్ యార్డు ముందు రాస్తారోకో చేస్తున్న రైతులు

నారాయణపేట టౌన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కందుల ధరలు పెంచి, కొనుగోలు చేయాలని నారాయణపేటలో రైతులు చేపట్టిన ఆందోళన రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఈ విషయమై సోమవారం మార్కెట్‌యార్డులో ధర్నా చేపట్టారు. రైతులు, వ్యాపారులకు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో రైతులు సోమవారం మార్కెట్ యార్డు ముందు హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ రాస్తారోకోకు పలువురు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బైఠాయించి, కలెక్టర్ వచ్చే వరకు నిరసన విరమించబోమని భీష్మించారు. దాంతో గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ పాలకవర్గం మాట్లాడే ప్రయత్నం చేసినా రైతులు ససేమిరా అన్నారు. పోలీసులు అధిక సంఖ్యలో మోహరించి ట్రాఫిక్ కొంత మళ్లించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రాంచందర్ యార్డుకు చేరుకొని, రైతులతో చర్చించారు. ధర క్వింటాలుపై రూ.250 పెంచి కొనుగోలు చేస్తామని చెప్పారు. అధికారులు, మార్కెట్ పాలకవర్గం, వ్యాపారులను ఒప్పించారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.



రోడ్డుపైనే రొట్టెలు తింటున్న రైతులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబ్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏడాది క్రితం తన కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జీర్ణించుకోలేని ఓ తల్లి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన అనసూయ (47) కుమారుడు గత ఏడాది రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఇది జీర్ణించుకోలేని ఆమె ఈనెల 14న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి కొట్టుమిట్టాడుతుండగా ఆమె చెల్లెలు మన్నెమ్మ చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. మృతురాలి తమ్ముడు వెంకట్ నాయరాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

హన్వాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చలిమంట కాపుకుంటూ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం గొండ్యాల గ్రామానికి చెందిన భూనేటి ఆశన్న (80) సోమవారం చలిమంట కాపుకుంటుండగా ప్రమాదవశత్తు మంట తగిలి బట్టలు అంటుకున్నాయి. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీధికుక్క దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

మక్తల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గద్వాల పట్టణానికి చెందిన ఆరేళ్ల బాలిక ఆరాధ్యను వీధి కుక్క కరవడంతో తీవ్రంగా గాయపడింది. గద్వాలకు చెందిన సారిక, శేఖర్‌గౌడ్ దంపతులు తమ కూతురితో కలిసి బంధువుల ఇంటికి వచ్చారు. తల్లి దండ్రులతో మాట్లాడుతుండగా వీధికుక్క బాలికపై దాడిచేసి గాయపర్చింది. తీవ్రంగా గాయపడ్డ బాలికను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. పట్టణంలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

పెబ్బేరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం దవాస్‌పల్లికి చెందిన పెద్దముక్కుల నందమ్మను కొందరు వ్యక్తులు ఫోన్‌లో పరిచయం చేసుకున్నారు. ఆమె దగ్గరున్న బంగారంతో పాటు, వెండి కడియాలు తీసుకెళ్లిన సంఘటన ఈ నెల 11వ తేదీన చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దుండగులు నందమ్మకు ఫోన్ చేసి పెబ్బేరుకు రమ్మని చెప్పారు. దీంతో ఆమె అక్కడికి వెళ్లింది. అక్కడి నుంచి బీచుపల్లికి వెళ్దామని బైక్‌పై తీసుకెళ్లారు. బీచుపల్లి బ్రిడ్జి కిందికి తీసుకెళ్లి.. ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి ఆభరణాలు తీసుకున్నారు. ఇవి మా ఇంటివాళ్లకు వాట్సాప్‌లో పెట్టి డబ్బులు ఇవ్వమని అడుగుతాం.. తర్వాత నీకు ఇచ్చేస్తామని నమ్మ బలికారు. ఆభరణాలను టవల్‌లో పెట్టి ఆమె వారికి అప్పగించింది. దీంతో ఆ దుండగలు వాటితో పాటు ఆమె దగ్గరున్న ఫోన్‌తో సహా పరారయ్యారు. ఆమె లబోదిబోమంటూ పెబ్బేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని ఆమె సెల్ ఫోన్ నెంబరు ఆధారంగా విచారణ చేపట్టారు. మంగళవారం ఇద్దరు నిందితులైన ధరూర్ మండలానికి చెందిన శివ అలియాస్ ఆశన్న, గద్వాల పట్టణానికి చెందిన బోయ జమ్మన్నలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి వస్తువులు రికవరీ చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వైద్యం కోసం వస్తే..

అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్ వైద్యులు

గద్వాలక్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రైవేట్ వైద్యులు అమాయక ప్రజల ఆరోగ్యాలలతో చెలగాటం ఆడుతూ వారి ప్రాణాలను తీస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. సంఘటన జరిగినప్పుడు మాత్రం హడావుడి చేసే వైద్యాధికారులు మామూళ్ల చేతిలో పడితే చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మళ్లీ అలాంటి సంఘటనలే పునరావృతం అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే తెలుస్తోంది. కొన్ని ఆస్పత్రులు నిబంధలనకు వ్యతిరేకంగా వైద్య సేవలు కొనసాగిస్తున్నా.. సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రాణాలు తీసిన సంఘటనలు..

గత నెల 28న గద్వాల పట్టణానికి చెందిన కవిత శ్వాసతీసుకుకునేందుకు కష్టంగా ఉందని జిల్లా ఆసుపత్రికి వస్తే అక్కడ ఉన్న ఓ డాక్టర్ నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రికి పంపించారు. అయితే వచ్చిరాని వైద్యం, వెంటనే మత్తుమందు ఇచ్చి ఆపరేషన్ చేసే క్రమంలో ఆ మహిళ పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన చికిత్స కోసం వెంటనే కర్నూల్ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

● జూన్ మాసంలో గద్వాల మండలానికి చెందిన ఓ గర్భిణీ ప్రసవం కోసం శ్రీరాఘవేంద్ర ఆసుపత్రికి రాగా వైద్యులు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. కానీ తల్లి పరిస్థితి విషమంగా ఉందని కర్నూల్ ఆస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

● జూన్ 23న గద్వాల పట్టణానికి చెందిన గర్భిణికి అనంత మల్లీ ఆసుపత్రిలో ప్రసవం చేశారు. ప్రసవం అనంతరం మహిళ పరిస్థితి విషయంగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు రెఫర్ చేశారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. వీటితో పాటు ఇతర సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇలా ప్రైవేట్ ఆస్పత్రులలో రోగుల ప్రాణాలను తీస్తున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మృతికి సంబంధించిన వివరాలు తెలుసుకుంటున్న పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్(ఫైల్)

ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే..

ప్రైవేట్‌కు పొమ్మంటున్నారు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజలు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి వస్తే అక్కడ ఉన్న ప్రైవేట్ డాక్టర్లు ఇక్కడ సరైన సౌకర్యాలు లేవు బయట మా ఆస్పత్రి ఉంది అక్కడికి పోవాలని సూచిస్తున్నారు. గతంలో ఉన్న ఓ సూపరింటెండెంట్ మాత్రం ఇప్పటికీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తమకు సంబంధించిన వారినే కాంట్రాక్టు సిబ్బందిగా పెట్టుకోవడంతో వారు ఆయనకు సంబంధించిన ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ధనార్జనే ధ్యేయంగా ..

జిల్లాలో మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా ప్రవేట్ ఆస్పత్రుల నిర్వహణ కొనసాగుతోంది. ఏ చిన్న జబ్బు చేసినా ధనార్జనే ధ్యేయంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం రోగిని భయభ్రాంతులకు గురిచేస్తూ ఆ పరీక్షలు... ఈ పరీక్షలు అంటూ.... బిల్లు మాత్రం భారీగా ఉండేలా చేసుకుంటున్నారు.

జిల్లాలో మొత్తం 38 ప్రైవేట్ ఆసుపత్రులు, 14 క్లినిక్‌లు, 12 దంత వైద్యశాలలు, 5 ఫిజియోథెరపీ కేంద్రాలు, 79 డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నా యి. కానీ చాలా వరకు నిబంధనలకు వ్యతిరేకంగానే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడంతో వారు చేసిందే వైద్యం అన్నట్లుగా నడుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు



ఇష్టానుసారంగా వైద్యం చేసి రోగుల ప్రాణాలు తీసే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవలే అయిజ పట్టణానికి చెందిన మహిళ ప్రాణాలు పోయిన విషయంపై సంబంధిత ఆసుపత్రిని సీజ్ చేశాం. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంబంధింత డాక్టర్‌పై కేసు నమోదు చేశారు. ఏది ఏమైనా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు.

\- డాక్టర్ సిద్దప్ప, డీఎంహెచ్‌వో, గద్వాల

ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దన్నందుకు వ్యక్తిపై కేసు

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీస్ అధికారి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా ఓ వ్యక్తి మీరే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించడంతో ఆ వ్యక్తికి రెండువేల జరిమానా విధించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం చర్చనీయాంశమైంది. వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన మైనుద్దీన్ తన ఇంటి ముందు నిలబడగా అటుగా ట్రాఫిక్ పోలీస్ అతివేగంగా వెళ్తనాడు. అతన్ని ఆపి మీరే ఇలా డ్రైవ్ చేస్తే ఎలా అని ప్రశ్నించాడు. దీంతో సదరు పోలీస్ అధికారి అతడు వాహనం పక్కన నిలబడి ఉండగా అతని ఫొటో తీసి రూ. 2వేలు జరిమానా వేశాడు. సదరు అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తపాలా ద్వారా సంక్షేమ పథకాలు

\- వనపర్తి జిల్లా పర్యవేక్షకుడు భూమన్న



పోస్టాఫీస్ ఆవరణలో మొక్క నాటుతున్న భూమన్న

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు తపాలా కార్యాలయాల ద్వారా అమలు చేస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని తపాలా శాఖ వనపర్తి డివిజన్ పర్యవేక్షకుడు భూమన్న అన్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లిలోని తపాలా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం తపాలా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తపాలా పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రతీ ఒక్కరికి జీవిత బీమా, ప్రమాద బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ తపాలా అధికారి సృజన్‌నాయక్, తపాలా బ్యాంకు మేనేజర్ ప్రసాద్, భవాని గౌడ్, సహయకులు జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినం

\- హాజరైన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు మందిరంలో ఏర్పాటు చేసి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై సీనియర్ విశ్రాంత ఉద్యోగులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. సన్మానం అందుకున్న సీనియర్ విశ్రాంత ఉద్యోగుల్లో జటమోని నరసయ్య, నరసింహమూర్తి, బుచ్చయ్య, కృష్ణారెడ్డి, సయ్యద్ రఫియోద్దీన్, ఎండీ.సుల్తాన్, బాలరాజు గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, బాలస్వామి, సుజ్ఞానమూర్తి, రాఘవాచారి, నిజాముద్దీన్, సరళమ్మ, సుక్కమ్మ ఉన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ జీవితంలో అపార అనుభవం ఘటించి విశ్రాంత జీవితంలో ఆరోగ్యంగా జీవించడం హర్షణీయమన్నారు. నాగర్‌కర్నూల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమానికి హాజరై వారిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, సంఘం నాయకులు యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పెన్షనర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు

నిప్పంటించుకొని విద్యార్థిని ఆత్మహత్య

మిడ్జిల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు కథనం ప్రకారం.. మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన బాలరాజు కుమార్తె శ్రీలత (17) జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు మంటలు ఆర్పి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భక్తులతో మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ జియర్ స్వామి

అమ్రాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలం నల్లమల లోతట్టు అటవీ ప్రాంతం బీకే లక్ష్మాపురం సమీపంలో వెలిసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద హనుమాన్ ఆలయం నిర్మించేందుకు త్రిదండి దేవనాథ జియర్‌స్వామి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. అంతకుముందు దేవనాథ జియర్ స్వామి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ట్రస్ట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో రూ. 10 లక్షలతో హనుమాన్ ఆలయం నిర్మించడానికి భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అలాగే, బీకే లక్ష్మాపురం గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. మండల పరిధిలోని వంగరోనిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలతో పాటు నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో 51 ఆలయాలను నిర్మించనున్నట్లు వికాస తరంగిణి ప్రతినిధి గోపాల్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీకే లక్ష్మాపురం తండావాసులు మోతీలాల్, నాగరాజు, శివ ప్రసాద్, సోమ్లానాయక్, డాక్టర్ బిక్కునాయక్, పాండు, హనుమంతు తదితరులు ఉన్నారు.

తల్లీ కూతురు అదృశ్యం

\- కేసు నమోదు

తెలకపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నరేష్ తెలి పిన వివరాల ప్రకారం.. ఆ గ్రామంలో భార్యాభర్తలు సోమవారం కూలి పనుల కు వెళ్లారు. సాయంతం ఇంటికి వచ్చాక ఆమె ఫోన్లో ఎవరితోనూ మాటాడుతుండగా భర్త ఎవరితో మాట్లాడుతున్నావు అంటూ అడిగాడు. భర్తను చూడ గానే ఫోన్ కట్‌చేసి, ఏదేదో సమాధానం చెప్పింది. ఆ రాత్రికి భోజనం చేసి, ఆరేళ్ల కూతురుతో కలిసి అందరూ నిద్రించారు. తెల్లవారుజామున చూసే సరికి భార్య, కూతురు కనిపించలేదని భర్త తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- క్రీడాకారులకు అభినందనలు : డీవైఎస్‌వో శ్రీనివాస్
- సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు బేస్‌బాల్ జిల్లా జట్టు



జిల్లా బేస్‌బాల్ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్, కోచ్, మేనేజర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నలవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆకాంక్షించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు మంగళవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీవైఎస్‌వో పాల్గొని, జట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లు టోర్నీలో సత్తా చాటాలన్నారు. అన్ని క్రీడాంశాల్లో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రగ్బీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, పీడీలు వేణుగోపాల్, పరశురాం, కోచ్, మేనేజర్లు సాదిక్‌అలీ, నాగరాజు, రాఘవేందర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్ల క్రీడాకారులు వీరే..

సీఎం కప్ రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనే బాలుర జట్టులో లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌నాయక్, కిరణ్‌కుమార్, నజీబ్ ఉర్ రెహిమాన్, శ్రీను, మోహన్, శ్రీకాంత్, లోకేశ్, రాహుల్, రామ్‌చరణ్, విష్ణు, కిరణ్, ఆకాష్, నరేశ్‌రాథోడ్, ప్రసాద్ ఉన్నారు. బాలికల జట్టులో కీర్తి, నిఖిత, పల్లవి, వర్షిత, స్వప్న, శిరీషారాణి, జోత్స్న శ్రీజ, మౌనిక, సుష్మితారెడ్డి, ఐశ్వర్య, నవ్యశ్రీ, శ్వేత, చైత్ర, హరిత, అంజలి ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర
- ఉత్సాహంగా జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. అండర్-16, 18, 20 బాల బాలికలు, మహిళలు, పురుషుల జిల్లా జట్ల ఎంపికకు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదని, ఎంతో మంది జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని గుర్తు చేశారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి భానుకిరణ్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, అథ్లెటిక్స్ సంఘం సభ్యుడు శ్రీనివాస్, కోచ్ ఆనంద్‌కుమార్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కృష్ణ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యాన్ని భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేగుంట గ్రామానికి చెందిన బస్వరాజ్ (48) తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక మంగళవారం తెల్లవారుజామున పత్తి పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ నవీద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుడు గణేశ్ ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసు విధులకు ఆటంకం, ఇద్దరిపై కేసు

తెలకపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని లింగాల రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంకు వద్ద గొడవ జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ రేణయ్య అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా తెలకపల్లికి చెందిన రజనీకాంత్, కొంగరి జయప్రకాశ్ ఇద్దరూ కలిసి అతడితో దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయంపై కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రైల్వే ఫ్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2పై మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (70) మృతి చెందాడు. గమనించిన ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు.

పొగచూరుతున్న బతుకులు

- దుర్భర పరిస్థితుల్లో బీడీ కార్మికులు
- అమలు కాని సంక్షేమ పథకాలు
- అందుబాటులో లేని వైద్య సేవలు
- పట్టించుకోని పరిశ్రమ యాజమాన్యాలు



అమరచింతలో బీడీలు చుట్టే పనిలో నిమగ్నమైన కార్మికులు

అమరచింత, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికుల బతుకులు పొగచూరుతున్నాయి. రోజంతా బీడీలు చుట్టినా పూటగడవడమే కష్టమవుతోంది. సంవత్సరాల తరబడి ఇదే వృత్తిలో కొనసాగుతున్న వారు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రధానంగా క్షయ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంది. బీడీ కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని పాలకులు చెప్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

అందుబాటులో లేని వైద్య సేవలు

సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేక బీడీ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మెడ, నడుము నొప్పి, రక్తహీనత, గొంతు ఇన్ఫెక్షన్ తదితర అనారోగ్య సమస్యలతో పాటు ఎక్కువ మంది కార్మికులు క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 40 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారు. కానీ కొత్తకోట, అమరచింత పట్టణాల్లో మాత్రమే బీడీ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. అమరచింత ఆసుపత్రి పరిధిలో నర్వ, ఆత్మకూరు, సీసీ కుంట, ధన్వాడ పరిధిలో దాదాపు 25 వేల మంది బీడీ కార్మికులకు వైద్య సేవలు అందాల్సి ఉంది. ఈ ఆసుపత్రి వైద్యులు గతంలో గ్రామాలకు సైతం వెళ్లి బీడీ కార్మికులకు సేవలు అందించే వారు. నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అలవెన్స్ తగ్గించడంతో వైద్యులు ఆసుపత్రికే పరిమితమయ్యారు. దీంతో వయసు పైబడి అనారోగ్యంతోటీ బాధపడుతున్న బీడీ కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి రాలేక పోతున్నారు. ఈ పరిస్థితుల్లో క్షయతో పాటు, శ్వాసకోశ వ్యాధులతో పలువురు మృతి చెందారు.

తగ్గిన పని దినాలు

బీడీ కార్మికులకు పనిదినాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. గతంలో నెలకు 28 నుంచి 30 రోజుల పని దినాలు ఉండేవి. ప్రస్తుతం ఈ పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడడంతో కార్మికులకు ప్రతీ నెల 10 నుంచి 15 రోజులు మాత్రమే పని దినాలు ఉంటున్నాయి. కుటుంబం మొత్తం ఇదే వృత్తిపై ఆధారపడి ఉండడంతో, వేతనాలు సరిపోక పస్తులు ఉండే పరిస్థితి నెలకొన్నది. వెయ్యి బీడీలకు 207 రూపాయలు మాత్రమే ఇస్తుండటంతో కార్మికులకు కుటుంబపోషణ భారంగా మారింది. ఇటు పని దినాలు తగ్గిపోవడం, అటు యజమానులు ఇచ్చే వేతనమూ తగ్గిపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సిగరెట్‌పై లేని ఆంక్షలు బీడీపై ఎందుకు?

కార్పొరేట్ సంస్థలు తయారు చేస్తున్న సిగరెట్లపై లేని ఆంక్షలు, బీడీ పరిశ్రమపై ఎందుకని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక సంఘాల నాయకులు పోరాడినా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా 2017లో బీడీ పరిశ్రమను జీఎస్టీలో చేర్చింది. ప్రభుత్వం ఆకుపై 18 శాతం జీఎస్టీ విధించడంతో పరిశ్రమపై పెనుభారం పడి ఉత్పత్తి వ్యయం పెరిగింది. అలాగే పొగాకు ఉత్పత్తులపై 28 శాతం జీఎస్టీ విధించడంతో అమ్మకాలపై ప్రభావం చూపింది.

పింఛన్ రావడం లేదు



నేను 60 ఏళ్లుగా బీడీ పని చేస్తూనే ఉన్నాను. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరువలేదు. తను అనేక సార్లు బీడీ కార్మిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా, పింఛన్ రావడం లేదు. ప్రభుత్వం, కంపెనీ స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

\- శాంతమ్మ, అమరచింత.

దరి చేరని సంక్షేమ పథకాలు

అర్హులైన బీడీ కార్మికులకు నేటికీ జీవన భృతి, పీఎఫ్, బీమా తదితర సౌకర్యాలు అందడం లేదన్న విమర్శలున్నాయి. పీఎఫ్‌కు సంబంధించి, పరిశ్రమల్లో కార్మికుల వాటా కట్ చేసుకుంటున్నా, యాజమాన్యాలు తమ వాటాను జమ చేయకపోవడం సమస్యగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికా రంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లుగా అర్హులైన కార్మికులకు జీవన భృతి అందడం లేదు. కానీ పలువురు అనర్హులకు జీవనభృతి లభిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అనర్హులను తొలగించి, అర్హులైన బీడీ కార్మికులందరికీ జీవన భృతి అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. బీడీ కార్మికులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన పోర్టల్ గత పదేళ్లుగా ఓపెన్ కావడం లేదు. దీంతో వేలాది మంది బీడీ కార్మికులు పీఎఫ్ ఉన్నా, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చిన్నప్పటి నుంచి బీడీల పనే..



చిన్నతనంలో పాఠశాలకు వెళ్లే వయస్సు నుంచి బీడీలు చుడుతున్నాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇదే వృత్తిలో కొనసాగుతున్నాను. అయినా మా బతుకులు మారలేదు. అప్పుడు ఎలా ఉన్నామో.. ఇప్పటికీ అలే గా ఉన్నాం.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

\- జయమ్మ, అమరచింత

కార్మికుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



బీడీ కార్మికుల ఆరోగ్యంపై పాలకులు దృష్టి సారించి ప్రతీ గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పీఎఫ్ వాటాను కార్మికులతో పాటు యజమాన్యాలు 50 శాతం చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇళ్ల నిర్మాణ పథకాన్ని కొనసాగించాలి. అద్దె భవనంలో కొనసాగుతున్న అమరచింత బీడీ కార్మికుల ఆసుపత్రికి సొంత భవనం నిర్మించాలి.

\- ఎస్.అజయ్, సీపీఎం, జిల్లా నాయకుడు

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రస్నానం

- ముగిసిన మల్దకల్ బ్రహ్మోత్సవాలు



శ్రీచక్ర స్నానం కార్యక్రమంలో పాల్గొన్న దాసులవారి వంశస్తులు

మల్దకల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం శ్రీచక్రస్నానంతో ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది క్యూలైన్లలో వేచి ఉన్నారు. వారందరూ ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునేలా వలంటీర్లు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. శేషదాస వంశస్తులు ధీరేంద్ర దాసు, రాఘవేంద్రదాసు, శశాంకదాసు, విష్ణుదాసుల ఆధ్వర్యంలో స్వామివారికి అవబృద శ్రీచక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఈవో సత్యచంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



దైవ దర్శనం కోసం ఆలయం ముందు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కోయిల్‌సాగర్ ఆయకట్టు పెంచాలి

- శాసనసభ సమావేశాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

భూత్పూర్, కొత్తకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ఆయకట్టు సాగు పెంచాలని దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. 1956లో కోయిల్ సాగర్ ప్రాజెక్టును నిర్మించినా, ఇప్పటి వరకు ఆయకట్టు పెంచలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా రెండు లిఫ్టులను ప్రతిపాదించామని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు కింద 12,500 ఎకరాల ఆయకట్టు మాత్రమే సాగవుతోందని, ఇప్పటి వరకు ఒక ఎకరాకు కూడా అదనంగా సాగునీరు అందలేదని తెలిపారు. 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావును కోరినా, ఫలితం లేకపోయిందన్నారు. కోయిల్‌సాగర్‌కు అతి సమీపంలో ఉన్న అజిలాపూర్ గ్రామానికి తాగునీరు కూడా రావడం లేదని, అక్కడ రూ. 39 కోట్ల వ్యయంతో లిఫ్టు నిర్మిస్తే గద్దెగూడెం, వెంకటాయపల్లి, చౌదర్‌పల్లి గ్రామాలకు నీరొచ్చే అవకాశం ఉందని తెలిపారు. మరో లిఫ్టును చౌదర్ పల్లి దగ్గర ఏర్పాటు చేయాలని, అందుకు అనుమతులు ఇచ్చి, నిధులు మంజూరు చేయాలని కోరారు. శంకర్ సముద్రం నుంచి ఎనిమిది గ్రామాలకు నీరు రావడం లేదని తెలిపారు. దుప్పల్లి లిఫ్టుకు రూ.6.6 కోట్లు ఖర్చు చేస్తే తాగు, సాగు నీరు అందే అవకాశం ఉంటుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొత్తకోట మండలం లోని శంకర సముద్ర రిజర్వాయర్ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి రూ. 33 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పనులు పూర్తయితే కుడి కాలువ పరిధిలోని నాలుగు మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. అందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందిస్తూ, ఎమ్మెల్యే చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నామని, త్వరలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జడ్చర్లను రెవెన్యూ డివిజన్ చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే జనంపల్లి



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు జడ్చర్లకు అన్ని వనరులున్నాయని తెలిపారు. అందుకోసం ప్రజలు పలుమార్లు ఆందోళనలు కూడా చేశారని సభ దృష్టికి తెచ్చారు. అలాగే నవాబ్‌పేట మండలంలోని కొల్లూరును మండలంగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విజ్ఞప్తిని స్వాగతిస్తున్నామన్నారు. సంబంధిత అధికారులతో నివేదికను తెప్పించుకుని, అవకాశాన్ని బట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉద్యాన పంటలకు కేంద్ర ప్రోత్సాహం

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మామిడి తోటల నమోదు, సేంద్రియ ధ్రువీకరణ, మార్కెటింగ్, ఎగుమతి తదితర అంశాలపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మామిడి తోటలు, మార్కెటింగ్, ఎగుమతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భారతదేశాన్ని ప్రపంచ మార్కెట్లో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం హార్టికల్చర్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాన్ని దేశంలోని 11 రాష్ట్రాలు, 12 క్లస్టర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయడం ప్రారంభించిందన్నారు. అందులో మన రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరులో దాదాపు 17 వేల మందికి పైగా రైతులు 52,912 ఎకరాల్లో మామిడి తోటలను పెంచుతున్నారని చెప్పారు. రూ. 165 కోట్ల బడ్జెట్‌తో ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను అమలు ఏజెన్సీగా జాతీయ ఉద్యాన బోర్డు ఎంపిక చేసినట్లు తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వరి, పత్తి కోటి 60 లక్షల ఎకరాలు, 12.42 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. పండ్ల తోటలతో పాటు కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు డీ బాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కే వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, పాల్గొన్న అధికారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ట్రాక్టర్, బొలెరో ఢీకొని ఒకరు..
- ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో మరొకరు..

అచ్చంపేట టౌన్/ మాగనూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని వైజంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న పత్తి ట్రాక్టర్, బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని ఓబులాపూర్ స్టేజీ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని బైక్ ఢీకొని మరొకరు చనిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని బాణాల గ్రామానికి చెందిన నాగేశ్ (26) కుటుంబసభ్యులతో కలిసి వంగూరు మండలంలోని ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలో ఓ శుభకార్యానికి బొలెరో వాహనంలో వెళ్లారు. కార్యక్రమం అనంతరం తిరిగి వస్తుండగా, హాజీపూర్ జిన్నింగ్ మిల్లు వైపు పత్తి లోడ్‌తో వెళ్తున్న టాక్టర్ ఢీకొన్నది. దీంతో బొలెరో వాహనాన్ని నడుపుతున్న నాగేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే దారిలో వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108కు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య గీత, ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

నారాయణపేట జిల్లా, మాగనూరు మండలంలోని గుర్రాలింగంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పవన్ (19) సోమవారం మక్తల్‌లో జరిగిన జాతరకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. 167వ జాతీయ రహదారిపై ఓబులాపూర్ స్టేజీ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు మక్తల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. తన కుమారుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్, యజమానిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని తల్లి రమాదేవి కోరారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మాగనూరు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం



ఇంటర్వ్యూ..

రైతులు పశు గణనకు సహకరించాలి

- పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్



ఊర్కొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండ మండలంలో పశుగణన పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, రైతులు సహకరించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కోరారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో పశుగణన ఎప్పటి నుంచి చేస్తున్నారు ?

పశుగణన మా శాఖ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రెండు గ్రామాలు అనగా ఊర్కొండపేట, ముచ్చర్లపల్లి పూర్తి అయ్యింది. మిగతా గ్రామాలు త్వరలోనే పూర్తి చేస్తాం.

మండలంలో ఎన్ని పశు వైద్యశాలలు ఉన్నాయి ?

మాదారంలో మెయిన్ సెంటర్ ఉంది. అదేవిధంగా మూడు సబ్ సెంటర్లు ఊర్కొండపేట, ముచ్చర్లపల్లి, రాచాలపల్లిలో ఉన్నాయి. మండల కేంద్రంలో ఎలాంటి సెంటర్ లేదు.

సిబ్బంది కొరత ఉందా ?

సిబ్బంది కొరతతో పాటు పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియదు.

రైతులకు ఏమైనా విషయాలు తెలియజేస్తారా ?

రైతులు పంటలు పండించడంతో పాటు పశు సంపదను పెంచాలి. దాంతో రైతులకు లాభాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో 'పశువులను పెంచండి-ఆదాయం పట్టండి' అనే నినాదంతో ముందుకు తీసుకువచ్చి అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

నేడు కొత్త భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం



నూతన తహసీల్దార్ కార్యాలయం

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం భవనంలో బుధవారం కార్యకలాపాలు కొనసాగుతాయని తహసీల్దార్ జేకే మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి నూతన తహసీల్దార్ కార్యాలయం భవనం నుంచే అన్నీ పనులు జరుగుతాయని, మండల ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్

అచ్చంపేటటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడి పని చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ జిల్లాలో నాలుగు స్థానాలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తూనే ఆయన 50వేల మెజార్టీతో గెలిచారని తెలిపారు. ఆయనకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు.

ఆశ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వాలు : సీపీఎం

వంగూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లతో వెట్టిచాకిరీ పనులు చేయిస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆశ వర్కర్లకు చాలీచాలని వేతనాలతో పూటగడవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశవర్కర్లకు వెంటనే రూ.18 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

వెల్దండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొట్ర గ్రామ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షునిగా జంగయ్యను మంగళవారం ఎన్నుకున్నారు. బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఈ సందర్భంగా శక్తికేంద్రం ఇన్‌చార్జి బాలస్వామి కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసాచారి, యాదయ్య, వెంకటనారాయణ, రాజుచారి తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు

లింగాల, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకుగాను మంగళవారం మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో చంద్రశేఖర్ మండలంలోని లింగాల, జిలుగపల్లి, రాయవరం తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

సంతరోజు ఎంత ఇబ్బందో..!

- సంత బజారు రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం
- చెత్తాచెదారం నిలిచి దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అమ్రాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సంతబజార్ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. సంతరోజు వ్యాపారులు, స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. సంత బజార్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల నుంచి మురుగునీరు ప్రవహించడానికి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నేరుగా ఆ నీరు రోడ్డుపైకి వస్తున్నది. దుర్వాసన వెదజల్లుతుంది. 20 ఏళ్ల క్రితం ఈ రోడ్డును బీటీగా మార్చినప్పటికీ కాలక్రమేణా చుట్టుపక్కల వారు కిరాణా షాపులు, ఇళ్ల నిర్మాణాలు ఎత్తుపెంచడం



అమ్రాబాద్ సంతబజార్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ద్వారా ఆ ఇళ్ల నుంచి వదులుతున్న మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో బురదమయంగా మారుతున్నది. దీనికి తోడు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో వారు పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల అభివృద్ధి అధికారి, సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్డుపైకి మురుగునీరు రాకుండా మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ రోడ్డును బాగు చేయించరా !



అమ్రాబాద్ సంత బజార్ రోడ్డుపై మురుగు నీరు వస్తుండటంతో దుర్వాసన వెద జల్లుతున్నది. సంత రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆరు నెలల నుంచి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేసినా వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు.

- ఎండీ రబ్బాని, అమ్రాబాద్

శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు



సంతబజార్ రోడ్డుపై తమ సిబ్బందితో మురుగు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఈ రోడ్డుకు రెండు వైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం.

- మల్లేష్, పంచాయతీ కార్యదర్శి, అమ్రాబాద్

లగచర్ల రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- పలు చోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతి

నాగర్‌కర్నూల్ టౌన్/ అచ్చంపేటటౌన్/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ తెలకపల్లి/ తాడూరు/ తిమ్మాజిపేట/ వెల్దండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అరాచకాలు, అణిచివేతల నుంచి రైతులను కాపాడాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు కోరారు. వికారాబాద్ జిల్లా లగచర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల అంబేడ్కర్ విగ్రహాలను వినతపత్రాలు ఇచ్చారు.

నాగర్ కర్నూల్‌లో మునిసిపల్ చైర్ పర్సన్ కల్పన భాస్కర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.



జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- అచ్చంపేటలో మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.
- కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కల్వకుర్తిలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.
- తాడూరులో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలగౌడ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన నిరసన తెలిపారు.
- తెలకపల్లిలో మాజీ గ్రంథాలయ చైర్మన్ మాధవరం హనుమంతురావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.
- తిమ్మాజిపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, సింగిల్ విండో ఉపాధ్యక్షులు రాందేవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కిల్లె మల్లయ్య, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి, అక్కడే ధర్నా నిర్వహించారు.
- వెల్దండలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు చల్ల మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, యాదగిరి, పోలే అశోక్, హన్మంతు, లింగం, కొండల్‌యాదవ్, ప్రభాకర్, నాగయ్య, రవికుమార్, శ్రీను, సక్రు, మహేష్, చెన్నయ్య, దశరథ్, సంజీవ, వెంకటయ్య ఉన్నారు.

పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉండొద్దు

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కందనూలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మాసిస్టుల సమీక్షా సమావేశం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ హాజరై ఫార్మాసిస్టులు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూడాలని, ఆన్‌లైన్‌లో మెడిసిన్ అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని, అవసరమైన మందులను సబ్ సెంటర్లకు పంపిణీ చేయాలన్నారు. జిల్లా సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌కు ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ వెంకట దాస్, డాక్టర్ తారాసింగ్, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి : డీఆర్‌డీవో

చారకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉంచాలని డీఆర్‌డీవో చిన్న ఓబులేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సిర్సనగండ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో వన నర్సరీలను ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలో రాహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. బ్యాగ్ ఫిల్లింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా పర్యవేక్షకుడు జీవన్‌ప్రకాష్, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంపీవో వెంకటేష్, ఏపీవో లక్ష్మయ్య ఉన్నారు.

నేడు బయోసైన్స్ టాలెంట్ టెస్టు

తాడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బయో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు మంగళవారం తెలంగాణ బయో సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పబ్బ శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో జిల్లాలోని 20మండలాల నుంచి తెలుగు మీడియం నుంచి ఇద్దరు, ఇంగ్లీష్ మీడియం నుంచి ఇద్దరు పాల్గొనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా డీఈవో పాల్గొనున్నారని అన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వంగూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి); మండలంలోని ఉల్పర వద్ద దుందుభీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాకర్లను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టుపడిన ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సాయికుమార్, శేఖర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

కందనూలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీకేఆర్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హైదరాబాద్ నుంచి డాక్టర్ బస్సీదేవిమల్లురవి, రెవ డాక్టర్ మోహన్‌బాబు, రెవ జి.ప్రసాద్‌చౌదరిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ బస్సీదేవి మల్లు రవి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పాస్టర్స్ మధ్యలో తాను ముఖ్యఅతిథిగా మాట్లాడడానికి అవకాశం కల్పించిన దేవదేవునికి కృతజ్ఞతలు చెల్లించారు. ప్రతీ ఒక్కరిలో ప్రభువైన ఏసుక్రీస్తు స్వరూపం కన్పించాలన్నారు. ఈ లోకంలో ప్రతీ ఒక్కరు ప్రేమ కరుణ జాలితో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాన్ బుచ్చయ్య, పౌల్ రాజు, వేదాంతిబాబు, సామ్యూల్, అన్ని చర్చిల సంఘపెద్దలు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు



కోడేరులో గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేసిన పోలీసులు

కొల్లాపూర్/ కోడేరు/ పెద్దకొత్తపల్లి/ తాడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మంగళవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి బయలు దేరుతున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు పరచకుండా తుంగలో తొక్కిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీలను అమలు పరచకుండా కాలయాపన చేస్తున్నదని అన్నారు. ఒక పక్క ప్రజాపాలన అంటూనే గ్రామ పంచాయతీ కార్మికుల హక్కులను విస్మరిస్తుందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కొల్లాపూర్ మండల అధ్యక్షుడు బాలస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లాపురం బాలరాజు, ఉపాధ్యక్షుడు పరమేష్, సహాయ కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.

- కోడేరులోనూ గ్రామ పంచాయతీ సిబ్బందిని మంగళవారం ఉదయం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పారిశుధ్యకార్మిక సంఘం నాయకుడు సాయిబాబా మాట్లాడుతూ అయిదు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. కార్మికులు సాయిబాబు, కృష్ణయ్య, బాలస్వామి, లక్ష్మయ్య, అలివేల వెంకటయ్య, లక్ష్మి పాల్గొన్నారు.
- పెద్దకొత్తపల్లిలోనూ గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్మికుల అరెస్టును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఖండించారు.
- తాడూరులో ఆరుగురు పంచాయతీ కార్మికులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడి పూజ

- హాజరైన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి
- దర్శించుకున్న భక్తులు



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి అయ్యప్పస్వామి విగ్రహాన్ని బహూకరిస్తున్న గురుస్వామి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ధర్మశాస్త శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మహాపడి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి రాకముందే ఆలయాన్ని సందర్శించి అయ్యప్పస్వామి అనుగ్రహం పొందానన్నారు. అయ్యప్పస్వామి కటాక్షం, గురుస్వాముల ఆశీర్వాదంతో ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించానన్నారు. గతేడాది పడి పూజకు హాజరైన సందర్భంగా ఇచ్చిన హామీల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించానని, రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అయ్యప్ప గురుస్వాములతో కలిసి ఎమ్మెల్యే అన్న ప్రసాదం స్వీకరించారు. మహాపడి పూజలో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కల్పన, కౌన్సిలర్లు తీగల సునేంద్ర, జక్కా రాజ్‌కుమార్, పద్మమ్మ, బాదం సునీత, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుందర్ గురుస్వామి, ఆలయ అర్చకులు విజయ్‌శాస్త్రి, గురుస్వాములు సందు మురళి, తెప్ప తిరుపతయ్య, జగన్మోహన్, ఖానాపురం ప్రదీప్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

బాధితుని పరామర్శించిన ఎమ్మెల్యే

తెలకపల్లి : మండల పరిధిలోని కార్వంగకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు

హాస్టల్ వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలి

- బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్

కొల్లాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో వసతి గృహాలలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్‌లోని గిరిజన సంక్షేమ కళాశాల హాస్టల్‌కు వెళ్లి అక్కడి విద్యార్థులతో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లాఇంచార్జీ రమేష్ మాదిగతో కలిసి దాస్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వార్డెన్ పోస్టులు భర్తీ చేయకపోవడం వలన ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో వార్డెన్ రెండు మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల హాస్టల్ వార్డెన్ల రాత పరీక్ష పూర్తి చేసి, వెరిఫికేషన్ పూర్తి అయినా ఇంకా వారికి పోస్టులు కేటాయించలేదని ఆయన తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్



మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్ వినోద్‌కుమార్

తాడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల చివరి వారంలో జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ యూత్ జిల్లా ప్రెసిడెంట్ కొత్తపల్లి వినోద్ కుమార్ అన్నారు. నూతనంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ మల్లురవి ఆదేశాల మేరకు ఈనెల చివరి వారంలో వనపర్తి జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువకులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, అన్వర్, మహేష్, గణేష్, రాములు, వంశీ ఉన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచేలా బోధించాలి

- డీఈవో రమేష్ కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేలా తరగతి గదిలో బోధన జరగాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నెల్లికొండ డిగ్రీ కళాశాలలో జిల్లా విద్యాశాఖ, టెక్ మహీంద్రా సంయుక్తంగా 73 మంది సైన్స్ ఉపాధ్యాయులకు డీఈవో రమేష్ కుమార్ చేతుల మీదుగా సైన్స్ కిట్లును పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన వర్క్‌షాప్‌లో డీఈవో మాట్లాడుతూ గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలపై పట్టు ఉన్నప్పుడే సాంకేతిక ప్రగతి సాధ్యపడు తుందన్నారు. జీవ, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు ప్రభుత్వం పంపిణీ చేసిన సైన్స్ కిట్లను వినియోగించి విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి భోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు షర్ఫు ద్దీన్, నూరుద్దీన్, శోభారాణి, సైన్స్ ఉపాధ్యా యులు శేఖర్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి, సత్యానంద్, రేవతి, అమీర్ పాల్గొన్నారు.

మందపై కుక్కల దాడి 18 మేకల పిల్లల మృతి

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మేకల మందపై ఊర కుక్కలు దాడి చేయడంతో 18 మేక పిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని దేవుని తిరుమలాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. దేవుని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన అంకలి పద్మ తన ఇంటి దగ్గర మేక పిల్లలను ఉంచి చుట్టూ ఇనుప జాలితో రక్షణగా ఏర్పాటు చేసింది. అయితే మనుషులు లేకపోవడంతో కుక్కలు మేక పిల్లలపై దాడి చేయడంతో 18 మేక పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు లక్షా ఉంటుందని బాధితురాలు పద్మ తెలిపింది. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ మండల కార్యదర్శి బుల్లెద్దుల శ్రీనివాసులు, మాజీ సర్పంచు సత్యం సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలు పద్మనుపరామర్శించి మనో ధైర్యం ఇచ్చారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని వారు అధికారులను కోరారు.

వీధి కుక్కల స్వైర విహారం

- నలుగురు చిన్నారులు, ఓ మహిళపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల స్వైర విహారం చేసి నలుగురు చిన్నారులు ఒక మహిళపై దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. పాఠశాలకు వెళ్తున్న చిన్నారిపై మరో ముగ్గురు చిన్నారులు ఆరు బయట ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేశాయి. అదే సమయంలో మరో ప్రాంతంలో వీధి కుక్కలు జానమ్మ అనే మహిళపై దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రి తరలించారు. తరచూ వీధి కుక్కలు చిన్నారులు, మహిళలపై దాడి చేస్తుండడంతో మరోమారు మునిసిపాలిటీలో ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుమాన్‌దిన్నె, చంద్రబండతండా గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేష్‌లు ఇందిరమ్మ గ్రామ కమిటీల సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపట్టారు. మాజీ జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్, మాజీ సర్పంచులు అరవింద్, రాంలాల్, శంకర్‌నాయక్ సర్వే నిర్వహించారు.

సరిహద్దు గ్రామాలలో ప్రారంభం కాని ఇందిరమ్మ ఇళ్ల సర్వే

దోమలపెంట, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ- ఆంధ్ర సరిహద్దు గ్రామాలైన అమ్రాబాద్ మండలం దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, ఇన్‌క్లాండ్ టన్నెల్‌లో (మత్స్యకారుల నాలనీ) ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం కాలేదన్ని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దోమలపెంట గ్రామ పంచాయతీ పరిధిలో 536 మంది దరఖాస్తులు చేసుకున్నారు. డిసెంబర్ 13 నుంచి 30 వరకు ఈ సర్వే కొనసాగనుంది. దోమలపెంట పంచాయతీ కార్యదర్శి ఇటీవలన సస్పెండ్ కావడంతో ఈ గ్రామ పంచాయతీ బాధ్యతలు తీసుకునేందు కార్యదర్శులు ఆసక్తి చూపడంలేదు. జిల్లా కేంద్రానికీ దూరంగా ఉండటం వలన జిల్లా అధికారులు కూడా తమ గ్రామాలపై శ్రద్ధ చూపడంలేదని మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిమ్మన్న, మాజీ ఉప సర్పంచ్ బుదాల ప్రసాద్‌లు పేర్కొంటున్నారు. దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ గ్రామలలో చేసుకున్న దరఖాస్తుల పరిశీలించి, ఆయా గ్రాలలో సర్వే చేయించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని వారుకోరుతున్నారు. ఈ విషయంపై బుధవారం అమ్రాబాద్ ఎంపీడీవో జగదీష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా దోమలపెంటలో సర్వే ప్రారంభం కానిది వాస్తవమేనని అన్నారు. అక్కడ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఆలస్యమవుతోందన్నారు. ఈ ససమస్య పరిష్కారం కోసం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.